సాక్షి వికారాబాద్

ఆదివారం । 3 । డిసెంబర్ । 2023



కాయ్ రాజా కాయ్

తెలంగాణ రాష్ట్రం అవరణ అనంతరం జరిగిన మూడో శాసనసభ ఎన్నికలు ఉత్కంఠ భరితంగా సాగాయి. 8లో▸



తాండూరు లోకల్.. ఎవరో?

నేడు ఫలితాలు వెలువడనున్న నేపథ్యంలో నియోజకవర్గ పరిధిలో అభ్యర్థులు, వారి అనుచరుల్లో టెన్షన్ మొదలయింది. 8లో▸



మార్కెట్‌కు వరిధాన్యం

ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 9లో▸

‘కౌంట్’డౌన్

నాలుగు నియోజకవర్గాలు.. మూడు ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటుగా పోటీలో ఉన్న స్వతంత్ర అభ్యర్థుల భవితవ్యం తేలేది నేడే. ఇందుకు సంబంధించి అధికారులు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశారు. స్ట్రాంగ్ రూంల వద్ద పారా మిలటరీ దళాలతో మూడంచెల భద్రత ఏర్పాటు చేశారు. ఈ లెక్కింపు ప్రక్రియ పార్టీల అభ్యర్థులు పోలింగ్ ఏజెంట్ల నడుమ కొనసాగనుంది. రౌండ్‌ల వారీగా ఫలితాలు ప్రదర్శించనున్నారు.

నేడే ప్రజా తీర్పు

- పరిగి మార్కెట్ యార్డ్‌లో నాలుగు సెగ్మెంట్‌ల ఓట్ల లెక్కింపు
- ఉదయం 8గంటలకు పోస్టల్ బ్యాలెట్‌తో కౌంటింగ్ ప్రారంభం
- అనంతరం ఈవీఎంల లెక్కింపు
- కౌంటింగ్ కేంద్రాల వద్ద భారీ బందోబస్తు
- ర్యాలీలు నిషేధం
- మద్యం షాపులు బంద్



కౌంటింగ్ కేంద్రం వద్ద భద్రత



పరిగి మార్కెట్ యార్డులో అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్ కేంద్రాలు

పరిగి/వికారాబాద్: తెలంగాణ శాసన సభకు నవంబర్ 30న ఎన్నికలు నిర్వహించగా ఆదివారం తుది ఫలితాలు వెలువడనున్నాయి. మరి కొన్ని గంటల్లోనే అభ్యర్థుల భవితవ్యం తేలనుంది. ఫలితాల విషయంలో అభ్యర్థులు, కార్యకర్తలు, నాయకులు ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే పార్టీలు గెలుపోటములపై ఓ అంచనా వేసుకున్నా.. సమయం దగ్గర పడుతున్నా కొద్దీ ఒకింత ఆందోళన చెందుతున్నారు. నాయకులు వచ్చి పరిస్థితులపై ఆరా తీసినప్పుడు మనమే గెలుస్తున్నామని చెబుతున్నప్పటికీ ఏదో అంతర్మథనం పడుతున్నట్లు పలువురు చర్చించుకుంటున్నారు. అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్ కోసం అధికారులు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. కౌటింగ్ కేంద్రాల వద్ద మూడంచల భద్రత ఏర్పాటు చేశామని పోలీసు అధికారులు వెల్లడించారు. పట్టణ కేంద్రంలోని మార్కెట్ యార్డులో నిర్వహిస్తున్న ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్దకు అధికారులు, అభ్యర్థులకు మాత్రమే మినహాయింపు ఇచ్చారు. ఇప్పటికే మార్కెట్ యార్డు నుంచి వెళ్లే మార్గాలను మూసి దారిని మళ్లించి అధికారులు జాగ్రత్తలు పడుతున్నారు.

కౌంటింగ్ కేంద్రాలకు ఈవీఎంలు

జిల్లాలోని వికారాబాద్, పరిగి, కొడంగల్, తాండూర్ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు ప్రక్రియ పరిగి పట్టణ కేంద్రంలోనే నిర్వహించనున్నారు. పోలింగ్ ముగిసిన వెంటనే ఈవీఎంలను స్ట్రాంగ్ రూంలో భద్రపరిచిన అధికారులు శుక్రవారం స్థానిక మార్కెట్ యార్డులో కౌంటింగ్ కేంద్రాలకు తరలించారు. అక్కడ స్ట్రాంగ్‌రూంలో భద్రపరిచి మూడంచెల భద్రత ఏర్పాటు చేశారు. పరిగిలో 2,821 మంది పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోగా ఆదివారం ఉదయం 8గంటలకు పోస్టల్ బ్యాలెట్‌ను ముందుగా లెక్కిస్తారు. తదనంతరం ఈవీఎంలను లెక్కిస్తారని అధికారులు వెల్లడించారు. ఓట్ల లెక్కింపునకు జిల్లాలోని నాలుగు నియోజకవర్గాలకు కలిపి మొత్తం వేయి మందికిపైగా సిబ్బంది ఓట్ల లెక్కింపులో పాల్గొంటారని అధికారులు వివరించారు.

14 టేబుల్స్.. 22 రౌండ్స్

ఓట్ల లెక్కింపు ఉదయం 8గంటలకు ప్రారంభిస్తారు. తొలుత పోస్టల్ బ్యాలెట్‌లతో ప్రారంభించిం అనంతరం ఈవీఎంలలో నిక్షిప్తమైన ఓట్లను లెక్కిస్తారు. ఒక్కో రౌండ్‌కు 14 టేబుల్స్ ఏర్పాటు చేశారు. మొత్తం 14 టేబుల్స్‌లను లెక్కించి మొత్తంగా ఏ అభ్యర్థికి ఎన్ని ఓట్లు పోలయ్యాయో ప్రకటిస్తారు. మధ్యాహ్నం 12 గంగల వరకు తుది ఫలితం తేలనుంది. అధికారులు ఎప్పటికప్పుడు మీడియా పాయింట్ వద్ద సమాచారం అందిస్తామని వెల్లడించారు.

కొడంగల్ ఫస్ట్.. పరిగి లాస్ట్

పోలైన ఓట్ల ఆధారంగా చూస్తే జిల్లాలో నాలుగు నియోజకవర్గాల్లో కొడంగల్ ఓట్లు తక్కువగా ఉండటంతో ముందుగా రిజల్టు వెలువడనుంది. పరిగిలో జిల్లాలోనే అత్యధిక ఓట్లు ఉండటంతో చివరన ఫలితాలు వెలువడనున్నాయి. ముందుగా పోస్టల్ బ్యాలెట్ ఓట్లు లెక్కించనున్నారు. జిల్లాలో మొత్తం నాలుగు నియోజకవర్గాల్లో 9,60,376 ఓట్లుండగా 7,38,728 ఓట్లు పోలయ్యాయి.

లెక్కింపు వివరాలు

నియోజకవర్గం	బూత్‌ల సంఖ్య	రౌండ్స్
పరిగి	305	22
వికారాబాద్	284	21
కొడంగల్	275	20
తాండూరు	269	20

పోస్టల్ బ్యాలెట్ వివరాలు

నియోజకవర్గం	పోలైన ఓట్లు
పరిగి	2,920
వికారాబాద్	1,810
తాండూరు	1,500
కొడంగల్	1,165
మొత్తం	7,395

ఓటింగ్ వివరాలు

నియోజకవర్గం	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు
పరిగి	2,59,422	1,98,986
వికారాబాద్	2,28,253	1,72,486
కొడంగల్	2,36,625	1,93,940
తాండూరు	2,36,62	1,74,002

సమష్టిగా పనిచేయాలి: కలెక్టర్ నారాయణరెడ్డి



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

కౌంటింగ్ అధికారులంతా సమష్టిగా పనిచేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నారాయణరెడ్డి సూచించారు. శనివారం ఆయన మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాలను సందర్శించారు. అనంతరం కౌంటింగ్ విధులు నిర్వహించే సూపర్‌వైజర్స్, అసిస్టెంట్ సూపర్‌వైజర్స్, మైక్రో అబ్జర్వర్ల శిక్షణ కార్యక్రమంలో పాల్గొని పలు సూచనలను ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ... లెక్కింపు ప్రక్రియలో సూపర్‌వైజర్ల పాత్ర కీలకమన్నారు. ప్రతీ ఒక్కరు పారదర్శకంగా కౌంటింగ్ విధులు నిర్వహించాలన్నారు. విధులు నిర్వహించే సిబ్బంది ఉదయం 5గంటల వరకు గుర్తింపు కార్డులతో కౌంటింగ్ కేంద్రం వద్ద ఉండాలన్నారు. కౌంటింగ్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగుకుండా అన్నిచర్యలు తీసుకున్నామన్నారు. జిల్లా పోలీసులతో పాటుగా స్పెషల్ బెటాలియన్, సీఆర్‌పీఎఫ్ సాయుధ బలగాలతో భద్రతను పటిష్టం చేశామని చెప్పారు. అసాంఘీక శక్తులను అరికట్టడానికి ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. వికారాబాద్‌లో 4 సెగ్మెంట్ల కౌంటింగ్ ఉన్నందున భద్రతా దృష్ట్యా పట్టణంలో 144వ సెక్షన్ విధించినట్లు తెలిపారు. కౌంటింగ్ పూర్తయిన విజయోత్సవ ర్యాలీలు, సంబరాలను నిషేధించినట్లు పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు నడచుకోవాలని, ఎవరైనా ర్యాలీలు చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కౌంటింగ్ జరిగే వ్యవసాయ మార్కెట్ రూటులో ట్రాఫిక్‌కు మళ్లిస్తున్నామని, ప్రయాణికులు సహకరించాలని సూచించారు. కౌంటింగ్ రోజున మద్యం దుకాణాలు మూసివేస్తారని చెప్పారు. కౌంటింగ్ విధుల్లో పాల్గొనే అధికారులు, సిబ్బంది, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా, పలు రాజకీయ పార్టీల అభ్యర్థులు, ఏజెంట్ల కోసం ప్రత్యేకంగా పార్కింగ్‌ను ఏర్పాటుచేశామని వివరించారు. కౌంటింగ్ ప్రశాంతంగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌంటింగ్ పరిశీలకులు స్నేహా ఆకాశ్, ఆర్‌ఓలు రాహుల్‌శర్మ, విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

క్రాస్ ఓటింగ్ గుబులు!

బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌లో వెంట నడిచిన వారే హ్యాండిచ్చారని సోషల్ మీడియాలో పోస్టులు



తాండూరు: జిల్లాలోనే తాండూరు సెగ్మెంట్ ఫలితం ఉత్కంఠ భరితంగా మారింది. ఈ ఎన్నికలో అభ్యర్థుల వెంట నడిచిన వారే క్రాస్ ఓటింగ్‌కు పాల్పడ్డారంటూ సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. ప్రధానంగా అధికార బీఆర్‌ఎస్ అభ్యర్థి సిట్టింగ్ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి శిబిరంలో క్రాస్ ఓటింగ్ దడ పుట్టిస్తోంది. 2018లో కాంగ్రెస్ నుంచి విజయం సాధించిన పైలెట్ ఆ తర్వాత కారెక్కారు. దీంతో అప్పట్లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలంతా గులాబీ తీర్థం పుచ్చుకున్నారు. ఫలితంగా రెండు నెలల క్రితం వరకు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి కేడర్ కనిపించలేదు. అధికార పార్టీ నుంచి పరిగి టికెట్ ఆశించిన డీసీసీబీ చైర్మన్ బుయ్యని మనోహర్‌రెడ్డి బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్ తరఫున తాండూరు బరిలో నిలిచారు. బీఆర్‌ఎస్‌లో ఉన్న పాత కాంగ్రెస్ నాయకులను, కార్యకర్తలను తిరిగి పార్టీలోకి చేర్చుకోవడంతో పాటు బీఆర్‌ఎస్‌కు చెందిన పలువురు నాయకులను సైతం తన వైపు తిప్పుకోవడంలో సక్సెస్ అయ్యారు. నియోజకవర్గంలో బలమైన నేతగా ఎదిగిన రోహిత్‌రెడ్డి ప్రభుత్వ పథకాలతో పాటు తనను నమ్మి నడుస్తున్న వారితో వ్యూహాత్మకంగా ముందుకు సాగారు. నేను తాండూరు బిడ్డను నన్ను ఆశీర్వదించండి కష్టసుఖాల్లో మీకు తోడుగా ఉంటానని ఓటర్లను అభ్యర్థించారు. ఇదిలా ఉండగా బీఆర్‌ఎస్‌లోనే కొనసాగుతున్న కొంతమంది నేతలు ఆయనకు వ్యతిరేకంగా ఓట్లు వేశారనే ప్రచారం సాగుతోంది. మరోవైపు కాంగ్రెస్‌లోనూ ఇదే పరిస్థితి ఉన్నట్లు తెలుస్తోంది. హస్తం పార్టీలో కొనసాగుతున్న పలువురు కార్యకర్తలు, నాయకులు బీఆర్‌ఎస్‌కు ఓట్లు వేయించారనే చర్చ కూడా సాగుతోంది. ఎమ్మెల్యేలకు ఎర కేసుల బీజేపీ జాతీయ నేతలను ఇరకాటంలో పెట్టారనే ఉద్దేశంతో ఆ పార్టీకి చెందిన కొంతమంది కార్యకర్తలు, నాయకులు రోహిత్‌రెడ్డికి వ్యతిరేకంగా ఓట్లు వేశారనే ప్రచారం కూడా ఉంది. ఇలా జరిగిన క్రాస్ ఓటింగ్ ఎవరికి అనుకూలిస్తుందో... ఎవరి పుట్టి ముంచుతుందో మరికొద్ది గంటల్లో తేలిపోనుంది.

సైలెంట్ ఓటింగ్.. టఫ్ ఫైటింగ్

తాండూరు రూరల్: పోలింగ్ పూర్తయింది మొదలు ఓటరు నాడీ పట్టేందుకు నేతలు తంటాలు పడుతున్నారు. పల్లెల్లో జరిగిన సైలెంట్ ఓటింగ్ ఎవరికి అనుకూలం.. ఎవరికి ప్రతికూలంగా మారిందనేది అనేది అంతుచిక్కడం లేదు. ఏ ఇద్దరు వ్యక్తులు కలిసినా బీఆర్‌ఎస్ తొమ్మిదేళ్ల పాలన కారుకు కలిసొస్తుందా..? లేక కాంగ్రెస్‌వైపు మొగ్గు చూపారా అనే చర్చలు సాగుతున్నాయి.

ఎవరికి ‘మేజర్’ పంచాయతీ

మండల పరిధిలోని కరన్‌కోట్ మేజర్ పంచాయతీ. ఇక్కడ దాదాపు 6వేల పైచిలుకు ఓట్లుండగా 4వేల ఓట్లు పోలయ్యాయి. దాదాపు 60శాతం పోలింగ్ జరగ్గా కాంగ్రెస్, కారు పార్టీల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. స్థానికంగా సీసీఐ సిమెంట్ ఫ్యాక్టరీ ఉండడంతో వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రజలు ఓటు హక్కును కలిగియున్నారు. ఆ ఓటర్లు ఎటు వైపు మొగ్గు చూపారనేది నాయకులకు అంతుచిక్కడం లేదు.



మాట్లాడుతున్న ఎస్పీ కోటిరెడ్డి

విజయోత్సవాలు నిషేధం

ఎస్పీ కోటిరెడ్డి

పరిగి: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఫలితాల అనంతరం విజయోత్సవ ర్యాలీలు, సమావేశాలకు నిషేధించినట్లు ఎస్పీ కోటిరెడ్డి వెల్లడించారు. శనివారం ఆయన మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన ఎన్నికల కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలించి పోలీసు సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ఆదివారం ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా మార్కెట్ యార్డు పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ అమలులో ఉందన్నారు. ఏ నలుగురు వ్యక్తులు గుమికూడకుండా చూడాలన్నారు. గెలిచిన అభ్యర్థుల తాలూకా టపాసులు కాల్చడం, సంబురాల నిషేధం ఉన్నట్లు వివరించారు. ఇతరులను కించపరిచేలా సోషల్ మీడియలో పోస్టులు చేసే వారిపై చట్టపరమైన చర్యలుంటాయని హెచ్చరించారు. రిటర్నింగ్ అధికారి జారిచేసిన ఫోటో ఐడీ కార్డు ఉన్న వారిని మాత్రమే కౌంటింగ్ కేంద్రంలోపలికి అనుమతించాలన్నారు. కౌంటింగ్‌కు దాదాపు 400మంది పోలీసు సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ మురళీధర్, రవీందర్‌రెడ్డి, డీఎస్పీలు, సీఐలు తదితరులు పాల్గొన్నారు.

జస్ట్ రిలాక్స్

ప్రచారం.. పోలింగ్‌లో తలమునకలైన నేతలు రిలాక్స్ అవుతున్నారు. ఆత్మీయులను కలుస్తూ సేద తీరుతున్నారు. శనివారం బీఆర్‌ఎస్ వికారాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ మెతుకు ఆనంద్ పట్టణంలోకి ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఛాయ్ తాగుతూ అక్కడ ఉన్నవారితో ముచ్చటించారు.

– అనంతగిరి



పర్యావరణ పరిరక్షణకు నడుం బిగించాలి

- ప్రముఖ పర్యావరణవేత్త, రిటైర్డ్ ప్రొఫెసర్ పురుషోత్తంరెడ్డి



సదస్సుకు హాజరైన విద్యార్థులతో పర్యావరణ నిపుణులు, నిర్వాహకులు

కడ్తాల్: పర్యావరణ పరిరక్షణకు యువత నడుం బిగించాలని ప్రముఖ పర్యావరణవేత్త, రిటైర్డ్ ప్రొఫెసర్ పురుషోత్తంరెడ్డి అన్నారు. మండల పరిధిలోని అన్మాస్‌పల్లి సమీపంలోని ఎర్త్ సెంటర్‌లో కౌన్సిల్‌ఫర్ గ్రీన్ రెవల్యూషన్ పర్యావరణ సంస్థ ఆధ్వర్యంలో శనివారం ‘వాతావరణ భద్రత–యువత పాత్ర’ అంశంపై సదస్సు నిర్వహించారు. సదస్సుకు పురుషోత్తంరెడ్డితోపాటు సీజీఆర్ చైర్‌పర్సన్ లీలా లక్ష్మారెడ్డి, పర్యావరణ నిపుణుడు దొంతి నర్సింహారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పురుషోత్తంరెడ్డి మాట్లాడుతూ.. యువత పర్యావరణ రక్షణకు నాయకత్వం వహిస్తూ, ప్రభుత్వ విధానాల్లో మార్పులు తీసుకువచ్చేందుకు కృషి చేయాలని.. సమాజంలో సుస్థిర అభివృద్ధికి వారధిగా నిలవాలని పిలుపునిచ్చారు. సీజీఆర్ చైర్ పర్సన్ లీలా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. పర్యావరణ రక్షణతోనే మానవ మనుగడ ఆధారపడి ఉందన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములయ్యేందుకు యువత కదిలి రావాలని కోరారు. పర్యావరణ మార్పులు, సుస్థిర అభివృద్ధి తదితర ప్రాధాన్యత అంశాలపై దొంతి నర్సింహారెడ్డి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీజీఆర్ వ్యవస్థాపకుడు లక్ష్మారెడ్డి, ఎర్త్‌సెంటర్ డైరెక్టర్ డాక్టర్ సాయిభాస్కర్‌రెడ్డి, ఎన్ఆర్ఐ విజయ్ భాస్కర్‌రెడ్డి, వందేమాతరం ఫౌండేషన్ చైర్మన్ మాధవరెడ్డి, గౌతమిఫౌండేషన్ అధ్యక్షుడు కృష్ణ, అయిష్టర్ సంస్థ అధ్యక్షుడు సునీల్ శింగాడే, పర్యావరణ ప్రచారకర్త సురేశ్, సామాజిక కార్యకర్త రుచిత్ కమల్, వికాస్, వివిధ కళాశాలల ప్రొఫెసర్లు, ఎన్ఎస్ఎస్ ఇన్‌చార్జిలు, లీప్ ఎడ్యుకేషన్ సెంటర్స్ నిర్వాహకులు, సీజీఆర్ ప్రతినిధులు, వివిధ కళాశాలల విద్యార్థులు, పర్యావరణ ప్రేమికులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

పౌర సరఫరాల సంస్థ గోదాం తనిఖీ



ఆమనగల్లులో గోదామును తనిఖీ చేసిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రఘునందన్

ఆమనగల్లు: పౌర సరఫరాల శాఖ గోదాము నిర్వహణలో అవకతవకలకు పాల్పడినా, ఉదాసీనంగా వ్యవహరించినా చర్యలు తప్పవని పౌరసరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ మాచన రఘునందన్ హెచ్చరించారు. ఆమనగల్లు పట్టణంలోని పౌరసరఫరాల శాఖ గోదామును శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోదాములో స్టాకు, రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. రేషన్ షాపులకు సకాలంలో సరుకులను రవాణా చేయాలని అన్నారు. రేషన్‌బియ్యం తమకు ఇంకా పంపలేదని డీలర్లు ఫిర్యాదు చేయకుండా సకాలంలో వారికి పంపించాలని గోదాము ఇన్‌చార్జికి సూచించారు. ఎఫ్‌సీఐ నుంచి వస్తున్న బియ్యం స్టాకు తూకంలో అనుమానాలుంటే లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయాలన్నారు. రేషన్ షాపులకు పంపించే బియ్యాన్ని తప్పనిసరిగా తూకంవేయాలని, తూకం వేయకుండా పంపిస్తే చర్యలు తీసుకుంటామని గోదాము సిబ్బందిని ఆయన హెచ్చరించారు. సకాలంలో ప్రజలకు రేషన్ సరుకులను అందించాలని కోరారు.

కౌంటింగ్ కేంద్రం పరిశీలన



కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న రాచకొండ సీపీ దేవేంద్రసింగ్ చౌహాన్

ఇబ్రహీంపట్నం రూరల్: మంగళ్‌పల్లి సమీపంలోని కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాన్ని శనివారం రాచకొండ పోలీస్ కమిషనర్ దేవేంద్రసింగ్ చౌహాన్ మహేశ్వరం జోన్ డీసీపీ శ్రీనివాస్‌తో కలిసి పరిశీలించారు. అధికారుల తో మాట్లాడి ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్ ప్రక్రియ జరిగేలా చూడాలని అన్నారు. ఏజెంట్లు, పోలీసులు, అధికారులకు ప్రత్యేక ప్రవేశం కల్పించడం జరిగిందన్నారు. ప్రతి కౌంటింగ్ కేంద్రం వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా లెక్కింపు ప్రక్రియ పూర్తయ్యే లా అందరూ సహకరించాలని కోరారు.

ఇక ఎల్‌ఐసీ ఎంజీబీఎస్ మెట్రో స్టేషన్

సాక్షి, సిటీబ్యూరో: ఎంజీబీఎస్ మెట్రో స్టేషన్ పేరు మారింది. ఇక నుంచి ఈ స్టేషన్‌ను ఎల్ఐసీ ఎంజీబీఎస్ మెట్రోస్టేషన్‌గా పరిగణిస్తారు. ఈ మేరకు హైదరాబాద్ మెట్రో రైల్ ఇప్పటికే స్టేషన్ అనౌన్స్‌మెంట్‌లో మార్పు చేసింది. ఎంజీబీఎస్ మెట్రో స్టేషన్‌కు ముందు ఎల్ఐసీ అనే పదాన్ని చేరుస్తూ స్టేషన్‌లో ప్రత్యేక బోర్డులను ఏర్పాటు చేశారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో స్పాన్సర్లుగా వ్యవహరిస్తున్న వ్యాపార సంస్థల పేర్లను ఆయా స్టేషన్లకు ఏర్పాటు చేస్తున్న సంగతి తెలిసిందే. ప్రకాశ్‌నగర్, హైటెక్‌సిటీ, రాయదుర్గం తదితర స్టేషన్ల పేర్లను ఇప్పటికే మార్చారు. తాజాగా ఎంజీబీఎస్ మెట్రో స్టేషన్‌కు ఎల్ఐసీ కొత్తగా వచ్చి చేరింది.

రూ.70 లక్షలు గోల్‌మాల్ ?

అభ్యర్థి పరేషాన్

రాంగోపాల్‌పేట్: ఎన్నికలు పూర్తయ్యాయి అభ్యర్థుల జాతకాలు కొద్ది గంటల్లో తేలనున్నాయి. కానీ ఎన్నికల్లో గెలవాలనే ఉద్దేశంతో ఖర్చు విషయమై ఎవరూ ఆలోచించలేదు. ఎక్కడ ఎవరు ఎంత కావాలంటే అంత, అడిగినంత పంచేశారు. ఇదే అదనుగా కొందరు ద్వితీయ శ్రేణి నాయకులు అభ్యర్థులు చేతివాటం ప్రదర్శించారు. కంటోన్మెంట్ నియోజకవర్గంలో ఓ ప్రధాన పార్టీ అభ్యర్థి ఓ ద్వితీయ శ్రేణి నాయకుడిని నమ్మి రూ.2 కోట్లు అప్పగించింది. అయితే అతను అభ్యర్థి చెప్పిన వారందరికీ డబ్బులు పంచినట్లు చెప్పాడు. కానీ ఇంకా రూ.70 లక్షలు మాత్రం లెక్క తేలలేదు. ఎన్నికలు పూర్తయ్యాక సదరు అభ్యర్థి లెక్కలు అడిగితే పోలీసులు వచ్చారు, ఆ డబ్బును ఎక్కడో పడేశాను అని సమాధానం ఇచ్చాడు. దీంతో డబ్బు తెచ్చి ఇవ్వాలని అభ్యర్థి ఒత్తిడి చేయడంతో సదరు నాయకుడు తనకు ఒంట్లో బాగో లేదని వచ్చి చెబుతానని సమాధానం చెప్పడం గమనార్హం.

క్లుప్తంగా

వామ్మో.. చలి!

షాబాద్: జిల్లాలో చలి తీవ్రత రోజురోజుకు పెరుగుతోంది. ఉదయం ఆరు గంటలు దాటినా.. రోడ్లపై చీకటిగానే ఉంటుంది. రాత్రి వేళల్లో ఉష్ణోగ్రతలు పడిపోతుండడంతో ప్రజలు వణికిపోతున్నారు. వృద్ధులు, పిల్లలు చలిబారిన పడకుండా తల్లిదండ్రులు తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. తెల్లవారుజామున చలి తీవ్రత మరింత అధికంగా ఉండడంతో రోడ్ల వెంబడి, ప్రధాన వీధుల్లో కొందరు చలి మంటలు కాచుకుంటున్నారు.
వేసుకోవడంతో పాటు స్వెటర్లను ఎక్కువగా ఉపయోగిస్తున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- రోజురోజుకు ఉష్ణోగ్రతలు పడిపోతుండడంతో వ్యాధులు దరిచేరకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.
- ఉదయాన్నే గోరువెచ్చని నీటిని తీసుకోవాలని, చలిలో తిరగాల్సి వస్తే చెవులు, ముక్కు కప్పుకునేలా ఉన్న దుస్తులు, మంకీ క్యాప్ ధరించాలి.
- వేడి, వేడిగా ఉండే ఆహార పదార్థాలనే తీసుకోవాలని పలువురు వైద్యులు సూచిస్తున్నారు. శీతల పానీయాలు ఐస్‌క్రీంలు, ఇతర చల్లటి పానీయాలకు దూరంగా ఉండడం మేలు. స్వీట్లు ఎంత తక్కువగా తీసుకుంటే అంత మంచిది.
- చిన్న పిల్లల విషయంలో జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలి. తల్లిపొత్తిళ్లలో ఎక్కువ సమయం ఉండేలా చూసుకోవాలి. ప్రయాణం చేయాల్సి వస్తే శరీరాన్ని పూర్తిగా కప్పేసి ఉంచాలి.
- అస్తమా వ్యాధిగ్రస్తులు తప్పనిసరిగా మందులు వేసుకోవాలి. అత్యవసరంగా బయటకు వెళ్లాల్సి వచ్చినప్పుడు మాస్కులు, స్వెటర్లు ధరించడం ఉత్తమం.
- చలికాలంలో శరీరం పొడిబారకుండా నువ్వుల నూనెను స్నానానికి ముందు ఒంటికి రాసుకుంటే మెరుగైన ఫలితాలు ఉంటాయి.

ఘనంగా పడిపూజ


మొయినాబాద్‌రూరల్: పూజలో పాల్గొన్న అయ్యప్ప స్వాములు

మొయినాబాద్‌రూరల్: హిమాయత్‌నగర్ గ్రామంలో శనివారం వినోద్‌కుమార్ గంట స్వామి, నవీన్‌కుమార్ కత్తి స్వామి ఏర్పాటు చేసిన అయ్యప్ప పడిపూజను రాంచందర్ గురు స్వామి నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వామికి పూలు, పండ్లు నూతన వస్త్రాలు సమర్పించి పడిపూజ చేశారు. కుమ్మరి శోభాసత్తయ్యలు స్వాములకు అన్నదానం చేశారు. గురుస్వాములు మురళీ, రవీందర్, మహేందర్, మల్లేశ్‌యాదవ్, సతీష్‌గౌడ్, మల్లేష్‌ముదిరాజ్, అశోక్‌చారి పాల్గొన్నారు.

భక్తి భావంతో మెలగండి: బక్కని నర్సింలు

షాద్‌నగర్: ప్రతిఒక్కరూ భక్తి భావంతో మెలగాలని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు బక్కని నర్సింలు అన్నారు. సోలీపూర్ గ్రామ శివారులోని చౌడమ్మగుట్ట హనుమాన్ దేవాలయంలో వ్యాపారవేత్త ఎల్ కుమార్‌గౌడ్ భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బక్కని నర్సింలు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలన్నారు. భక్తి భావంతోనే మనస్సును ఏకాగ్రతతో ఉంచుకోవచ్చన్నారు. ఆలయంలో స్వామి వారికి పల్లకి సేవ నిర్వహించారు. అనంతరం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. గురుస్వామి సత్యనారాయణ అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. అర్చకులు రఘుపతిరావు, కృష్ణ, ప్రమోద్, సునీల్, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు శ్రీశైలం గౌడ్, వెంకటయ్య పాల్గొన్నారు.

నందిగామలో..

నందిగామ: మండల పరిధిలోని పారిశ్రామిక వాడలో అయ్యప్ప ఆలయంలో స్వాములకు అన్నదానం చేశారు. కొత్తూరు మండలం ఎస్బీపల్లికి చెందిన లింగారం సురేశ్‌గౌడ్ సహకారంతో అన్నదానం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.


షాద్‌నగర్: నర్సింలును సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

కాయ్ రాజా కాయ్

అభ్యర్థుల గెలుపోటములపై ద్వితీయ శ్రేణుల పందెం

- నేటి ఫలితాల కోసం ఆశగా ఎదురుచూపులు



ధారూరు: తెలంగాణ రాష్ట్రం అవతరణ అనంతరం జరిగిన మూడో శాసనసభ ఎన్నికలు ఉత్కంఠ భరితంగా సాగాయి. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో నువ్వానేనా అన్న రీతిలో జరిగాయి. మిగతా మూడింటితో పోల్చుకుంటే వికారాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో ప్రచారం, పోలింగ్ వాడివేడిగా జరిగింది. ఎన్నికల నగారా మోగినప్పటి నుంచి నిన్నటి పోలింగ్ వరకు యుద్ధ వాతావరణమే కనిపించింది. ఇక ఇప్పుడు వికారాబాద్ పీఠం ఎవరిని వరించనుందో అంటూ జోరుగా బెట్టింగ్‌కు దారి తీసింది. కాయ్ రాజా కాయ్ అంటూ స్థిర, చరాస్తులను సైతం పందెం కాసినట్లు సమాచారం.

జోరుగా బెట్టింగ్..

నవంబర్ 30న జరిగిన పోలింగ్ ప్రక్రియ.. ఏ పార్టీకి అనుకూలంగా లేదని, ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌ల మధ్యే గట్టిపోటీ ఉందని విశ్లేషకుల అభిప్రాయం. దీంతో ఇరు పార్టీల అభ్యర్థుల్లో ఎవరు గెలుస్తారో చూద్దామా? పందెమా? అంటూ ఆయా పార్టీల ద్వితీయ శ్రేణులతో పాటు, అభ్యర్థుల అనుచరులు సైతం కాయ్ రాజా కాయ్ అంటూ ఆట మొదలు పెట్టారు. ‘మీ పార్టీ గెలిస్తే.. ఐదేళ్ల వరకు ఊర్లో ఉండను. మీసం గీసుకుంట. అర ఎకరా పొలం రాసిస్తా, రూ.లక్ష పందెం’ అంటూ రకరకాలుగా జూదానాకి తెరతీశారు. ఇలా ఎవరికి ఎంత తోస్తే అంత అన్ని పార్టీల వారూ బెట్టింగ్ కాసి, ఫలితాల కోసం ఆశగా కాచుక్కూచున్నారు.

నిశ్శబ్ద విప్లవంలా..

పోలింగ్ అనంతరం గడిచిన 48 గంటల్లో నియోజకవర్గ ఓటర్ నాడీ ఎవరికీ అంతు చిక్కలేదు. దీంతో అభ్యర్థులు, వారి అనుచరుల గుండెల్లో రైళ్లు పరిగెట్టాయి. ఎవరికి వారే గెలుపు ధీమాతో ఉన్నప్పటికీ.. ఫలితాల కోసం వేయి కన్నులతో ఎదురు చూస్తున్నారు. ఆదివారం ఎపుడు వస్తుందా? గెలుపు ఎవరిని వరిస్తుందా అంటూ ఆందోళన చెందుతున్నారు. ధారూరు మండల పరిధిలో మొత్తం 34,544 ఓటర్లు ఉండగా.. అందులో 28,465 (పురుషులు 14,540 మంది, స్త్రీలు 13,925) మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. దీంతో 82.4 శాతం పోలింగ్ నమోదు అయింది. పలుచోట్ల నిశ్శబ్ద విప్లవంలా ఓటింగ్ జరిగిందని, ప్రజా కూటమీ విజయానికి ఇదే నిదర్శనమని జాతీయ యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సంతోష్‌కుమార్ పేర్కొన్నారు.

ఎవరి లెక్కలు వారివే..

సౌమ్యుడిగా, మృదు స్వభావం కలిగిన వ్యక్తిగా పేరున్న కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం ప్రసాద్‌కుమార్.. తన గెలుపు ఖాయమని ధీమా వ్యక్తంచేయగా.. సీఎం కేసీఆర్ చేపట్టిన సంక్షేమ పథకాలే ఆనంద్‌ను గెలిపిస్తాయని బీఆర్‌ఎస్ శ్రేణులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. పోలింగ్ అనంతరం ఆయా పార్టీల అభ్యర్థులు పోలింగ్ సరళిపై లెక్కలు వేసుకున్నారు. ఎగ్జిట్‌పోల్స్‌పై సుదీర్ఘంగా చర్చించారు. ఇలా ఎవరు ఎన్ని రకాలుగా చర్చించుకున్నా.. సర్వేలు చేసినా ఓటరు నాడితోనే అభ్యర్థుల భవితవ్యం ముడిపడి ఉందని, అందుకు నేటి ఫలితాలు వెల్లడయితే కానీ.. ఎవరి జాతకం ఎలా ఉందో చెప్పలేమని రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం.

తాండూరు లోకల్.. ఎవరో?

- ప్రజా తీర్పుకోసం ఎదురు తెన్నులు
- మరి కొద్దిగంటల్లో ఉత్కంఠకు తెర



పెద్దేముల్: ఎన్నికల ఫలితాలు మరి కొద్ది గంటల్లో వెలువడనున్న నేపథ్యంలో తాండూరు నియోజకవర్గ పరిధిలో పలు పార్టీల అభ్యర్థులు, వారి అనుచరుల్లో టెన్షన్ మొదలయింది. నెల రోజుల పాటు తాండూరు సెగ్మెంట్‌లో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ ఎమ్మెల్యేల అభ్యర్థులు నేనే లోకల్ అంటూ పోటాపోటీగా ముమ్మర ప్రచారం చేశారు. ఇక్కడే పుట్టాను, ఇక్కడే చస్తానంటూ అధికార పార్టీ అభ్యర్థి పైలెట్ రోహిత్‌రెడ్డి చెప్పగా.. తాండూరులో మూడు దశాబ్దాలుగా ఉంటున్నానని, ఇక్కడే వ్యాపారం చేస్తున్నానంటూ కాంగ్రెస్ అభ్యర్థి బుయ్యని మనోహర్‌రెడ్డి ఓటర్లను ఆకట్టుకున్నారు. అనంతరం గత నెల 30న పోలింగ్ జరిగింది. కానీ ఓటరు నాడి ఎవరూ కని పెట్టలేక పోయారు. నేడు ఫలితాలు వెల్లడి కానున్న నేపథ్యంలో లోకల్ ఎవరో.. నాన్ లోకల్ ఎవరో తేలనుంది. తాండూరు నియోజకవర్గంలో పెద్దేముల్, యాలాల, బషీరాబాద్, తాండూరు, తాండూరు మున్సిపల్ పరిధిలో మొత్తం 2లక్షల 36వేల 076 ఓటర్లు ఉండగా.. అందులో సుమారు లక్ష 74 వేల ఓట్లు పోలైనట్లు సమాచారం. ఇక మిగిలింది. ప్రజా తీర్పే. అందుకు నేడు వెలువడనున్న ఫలితాల కోసం అభ్యర్థులు, వారి అనుచరులు ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. దీనికి ముందు గడిచిన 48 గంటల్లో ఎగ్జిట్ పోల్స్‌పైనా చర్చించారు. ఎవరికి వారే లెక్కలు వేశారు. విజయం తమనే వరిస్తుందని ఆశాభావం వ్యక్తంచేస్తున్నారు. వీరందరి ఉత్కంఠకు తెరపడాలంటే మరి కొద్ది గంటలు ఎదురు చూడాల్సిందే మరి..

బాలిక ఆత్మహత్య

అత్తాపూర్: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ బాలిక ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ పులి యాదగిరి, ఎస్సై నిమ్మల వెంకన్న కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. శివరాంపల్లి వీకర్‌సెక్షన్ కాలనీకి చెందిన వెంకటేశ్ కుమార్తె కావేరి (13) శివరాంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 6వ తరగతి చదువుతోంది. కాగా ఆమె గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ స్కూల్‌కు సరిగ్గా హాజరు కావడం లేదు. శనివారం ఇంట్లో ఒంటరిగా ఉన్న కావేరి ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు.

కౌన్ బనేగా చేవెళ్ల బాద్‌షా

- మరి కొద్ది గంటల్లో తేలనున్న అభ్యర్థుల భవితవ్యం
- రాజేంద్రనగర్ లార్డ్స్ కళాశాలలో ఓట్ల కౌంటింగ్


కాలె యాదయ్య, బీఆర్‌ఎస్


పామెన భీంభరత్, కాంగ్రెస్


కెఎస్.రత్నం, బీజేపీ


చేవెళ్ల నియోజకవర్గ ముఖచిత్రం

చేవెళ్ల: చేవెళ్ల శాసనసభ్యుడు ఎవరో తేలే తరుణం రానేవచ్చింది. గత నెల నవంబర్ 30న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పోలైన ఓట్లను రాజేంద్రనగర్ పరిధి లార్డ్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం ఉదయం 8గంటలకు లెక్కించనున్నారు. ఈ నేపథ్యంలో చేవెళ్ల బరిలో నిల్చున్న అభ్యర్థుల భవితవ్యం తేలనుంది. ఈవీఎం ద్వారా లెక్కింపు ప్రక్రియ జరగనుండటంతో మధ్యాహ్నం వరకు ఫలితాలు వెలువడే అవకాశం ఉంది. చేవెళ్ల నియోజకవర్గ స్థానానికి 12 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. వీరిలో ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీల మధ్యే పోటీ ఎక్కువగా ఉంది. కాంగ్రెస్ అభ్యర్థిగా పామెన భీంభరత్, బీఆర్‌ఎస్ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే కాలె యాదయ్య, బీజేపీ నుంచి మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నంలు బరిలో ఉన్నారు. ఇక బీఎస్పీ నుంచి రాజమహేంద్రవర్మ ఉన్నారు. వీరంతా మూడు వారాలుగా ఒకరికి మించి మరొకరు ఓటర్లను ప్రసన్నం చేసుకున్నప్పటికీ.. వారు ఎవరికి మొగ్గు చూపారో మరి కొన్ని గంటల్లో బహిర్గతం కానుంది.

> ఎక్కడ చూసినా నరాలు తెగే ఉత్కంఠ. ఎవరి నాడి పట్టినా ఎన్నికల ఫలితాల చలి జ్వరం. విజయం ఎవరిని వరించనుందోనన్న ఉబలాటం. వెరసి ఎవరి నోట విన్నా.. కౌన్ బనేగా చేవెళ్ల అసెంబ్లీ బాద్‌షా అనే.. ఆసక్తికరమైన చర్చ జరుగుతోంది. ఈ చర్చకు ముగింపు.. మరో కొద్ది గంటల్లో వెలువడే ఎన్నికల ఫలితాలే పలుకనున్నాయి.

ఎవరిధీమా వారిదే

నేడు ఓట్ల లెక్కింపు నేపథ్యంలో అభ్యర్థులు ఎవరికి వారే గెలుపు ధీమాతో ఉన్నారు. నియోజకవర్గాన్ని ఎస్సీకి కేటాయించిన తరువాత జరిగిన ఎన్నికలతో ఇది నాలుగొవది అని చెప్పవచ్చు. ఇప్పటి వరకు టీడీపీ, కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌ను ఒక్కోసారి గెలుపు వరించంగా.. ఈ సారి ఏ పార్టీ నెగ్గుకొస్తుందో చూడాలి. ఈ ఎన్నికల్లో చేవెళ్ల గడ్డపై మా జెండాయే ఎగురుతుందని కాంగ్రెస్ అభ్యర్థి భీంభరత్ భరోసాతో ఉన్నారు. ఇక అధికార పార్టీ అభ్యర్థి కాలె యాదయ్య.. ఇంత కాలం బీఆర్‌ఎస్ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమాలే తనను గెలిపిస్తాయన్న ధీమాతో ఉన్నారు. బీజేపీ అభ్యర్థి కెఎస్. రత్నం.. ‘నేను సుపరిచితుడినని, ప్రజలు తనవైపే ఉన్నారని’ చెబుతున్నారు. ఏది ఏమైనా మరి కొన్ని గంటల్లో ప్రజలు ఎవరికి పట్టంకట్టారో, ఎవరిని ఇంటికి పంపిస్తారో తేలనుంది.

బీఆర్‌ఎస్‌లో సందిగ్ధం

షాబాద్: చేవెళ్ల నియోజకవర్గ ప్రజలు తమ ఓటు హక్కును చక్కగా వినియోగించుకున్నారు. శంకర్‌పల్లి మున్సిపాలిటీతో పాటు 5 మండలాలలో కలిసి 74.18 శాతం పోలింగ్ నమోదు అయింది. నియోజకవర్గంలో మొత్తం 2,62,005 ఓట్లు ఉండగా.. 1,93,408 (పురుషులు 99,186, మహిళలు 94,222) మంది తమ ఓటును వినియోగించుకోగా.. ఇతరులు నలుగురు ఉన్నా.. ఎవరూ ఓటు వేయలేదు.

కాంగ్రెస్ జోరు

అధికార బీఆర్‌ఎస్‌ను ఎగ్జిట్ పోల్స్ సందిగ్ధంలో పడేశాయి. మొదటి నుంచి ఎమ్మెల్యే కాలె యాదయ్యకు ప్రజల్లో వ్యతిరేకత ఉన్నప్పటికీ.. కేసీఆర్‌పై ఉన్న అభిమానంతో తమకు ఘన విజయాన్ని కట్టబెడతారని నాయకులు నమ్మారు. కానీ క్షేత్రస్థాయిలో ఈ సారి కాంగ్రెస్ తన జోరును ప్రదర్శించడం, ఓటింగ్ శాతం ఆ పార్టీకి మెరుగ్గా ఉండటంతో గులాబీ వర్గాల్లో పలు అనుమానాలు రేకెత్తాయి.

చాప కింద నీరులా కమలం

బీజేపీ అభ్యర్థిగా బరిలోకి దిగిన కెఎస్ రత్నంకు.. నవాబుపేట్, శంకర్‌పల్లి, చేవెళ్ల, మొయినాబాద్, షాబాద్ తదితర మండలాల్లో ప్రజాదరణ లభించింది. కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌కు ధీటుగా ఓట్లు పోలయ్యాయి. ముఖ్యంగా యువత భారీగా మొగ్గుచూపింది. దీంతో రత్నం గెలుస్తాడన్న ప్రచారమూ జరుగుతోంది.

జలమండలికి పీఆర్‌ఎస్‌ఐ నేషనల్ అవార్డు

సాక్షి,సిటీబ్యూరో: జలమండలికి మరో పురస్కారం లభించింది. పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా (పీఆర్‌ఎస్‌ఐ) నేషనల్ అవార్డు - 2023ను జలమండలి దక్కించుకుంది. పీఆర్‌ఎస్‌ఐ నిర్వహించిన ఇంటర్నేషనల్ పబ్లిక్ రిలేషన్స్ ఫెస్టివల్ - 2023 లో ‘కాఫీ టేబుల్ బుక్’ కేటగిరీలో రెండో బహుమతి లభించింది. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, ఎన్టీపీసీ, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్ మెంట్ (ఐఐఎం), ఇతర మల్టీనేషనల్ కంపెనీలతో పోటీ పడి ఈ అవార్డును దక్కించుకుంది. ఇటీవల ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో అవార్డును ప్రదానం చేశారు. శనివారం జలమండలి ప్రధాన కార్యాలయంలో పీఆర్వో సుభాష్, ఓఎస్డీ పీఆర్వో మనోహరాచారి ఎండీకి పురస్కారాన్ని అందజేశారు.

గతేడాది రెండు పీఆర్‌ఎస్‌ఐ అవార్డులు

పీఆర్‌ఎస్‌ఐ గతంలో నిర్వహించిన పలు పోటీల్లో జలమండలికి రెండు అవార్డులు దక్కాయి. వివిధ కేటగిరీల్లో నిర్వహించిన పోటీల్లో.. ఉత్తమ కమ్యునికేషన్ క్యాంపెయిన్, ప్రజా అవగాహన విభాగాల్లో జలమండలి మొదటి, మూడో బహుమతి దక్కించుకుంది. జలమండలి పీఆర్‌ఎస్ నేషనల్ అవార్డు గెలుచుకోవడం వరుసగా ఇది నాలుగోసారి కావడం విశేషం. కాగా జలమండలి ఈ ఏడాది ఇప్పటికే 4 అవార్డులు గెలుచుకుంది. మార్చి 18 న వరల్డ్ వాటర్, మే 1 న ఉత్తమ యాజమాన్య, జులై 5 న పొల్యూషన్ కంట్రోల్ బోర్డు (పీసీబీ), ఆగస్టు 1 న గ్లోబల్ ఇన్నోవేషన్ ఇన్ వాటర్ టెక్నాలజీ - 2023 అవార్డులు వచ్చాయి.

భవితవ్యం తేలేది నేడే

- గెలుపోటములపై సర్వత్రా చర్చ
- సీవీఆర్ కళాశాలలో ఓట్ల లెక్కింపు


కసిరెడ్డి నారాయణ రెడ్డి, కాంగ్రెస్


జైపాల్‌యాదవ్, బీఆర్‌ఎస్


ఆచారి, బీజేపీ

ఆమనగల్లు: కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గంలో విజయం ఎవరిని వరిస్తుందోనని అభ్యర్థులతో పాటు ప్రజలు కుతూహలంగా ఉన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా ముగిసినప్పటికీ.. గెలుపుపై సర్వత్రా చర్చ జరుగుతోంది. తమదే పై చేయి అంటూ ప్రధాన పార్టీల అభ్యర్థులు, వారి అనుచరులు ధీమా వ్యక్తంచేస్తున్నారు. అసెంబ్లీ పోటీలో మొత్తం 24 మంది ఉన్నారు. అందులో ప్రధాన పార్టీలైన కాంగ్రెస్ అభ్యర్థిగా కసిరెడ్డి నారాయణరెడ్డి, బీజేపీ నుంచి ఆచారీ, బీఆర్‌ఎస్ నుంచి జైపాల్‌యాదవ్‌లు ఉన్నారు. సెగ్మెంట్‌లో 2,41,762 మంది ఓటర్లు ఉండగా.. 2,01,285 ఓట్లు పోలయి.. 83.26 శాతం పోలింగ్ నమోదైంది. ఇక్కడ ఊహించిన దానికంటే ఎక్కువ శాతం పోలింగ్ కావడంతో ఏ అభ్యర్థికి అనుకూలంగా ఉంటుందోనన్న చర్చ జరుగుతోంది. పోలింగ్ సరళిని బట్టి ప్రధాన పార్టీల వారు.. ఎవరికి వారే లెక్కలు వేసుకుంటున్నారు.

ఇద్దరి మధ్యే పోటీ

జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ మధ్యే పోటీ రసవత్తరంగా ఉందని, వీరిలో ఎవరు గెలిచినా మెజార్టీ మాత్రం తక్కువగానే ఉంటుందనే ప్రచారం జరుగుతోంది. పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీలతో హస్తం నేతలు ప్రజల్లోకి వెళ్లగా.. మంచి స్పందన లభించిందని, దీనికి తోడు వివాద రహితుడైన కసిరెడ్డి నారాయణ రెడ్డి వైపు ప్రజలు మొగ్గుచూపుతున్నారని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. బీజేపీ అభ్యర్థి ఆచారి.. ఇప్పటికి ఐదుసార్లు ఓడిపోయి, ఆరోసారి బరిలో నిలిచారు. తనకు ఒక సారి అవకాశం ఇవ్వాలని ఆయన ప్రచారం చేశారని, అందుకు ప్రజల నుంచి తగిన స్పందన వచ్చిందని కాషాయ వర్గాలు చెప్పాయి. ఇక ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలే బీఆర్‌ఎస్ అభ్యర్థి జైపాల్ యాదవ్‌ను గెలిపిస్తాయని గులాబీ తమ్ముళ్లు స్పష్టం చేస్తున్నారు. ఇలా ఎవరికి వారే గెలుపోటములను చర్చించుకుంటూ.. బెట్టింగులకు పాల్పడినట్లు సమాచారం. ఏది ఏమైనా నేడు జిల్లా పరిధిలోని మంగళపల్లి సమీపాన సీవీఆర్ కళాశాలలో నిర్వహించే లెక్కింపు అనంతరం వెలువడే ఫలితాలే విజేతెవరే? పరాజితులెవరో తేలుస్తాయి.

కౌంటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

- ఉదయం 8 గంటల నుంచి లార్డ్స్ ఇంజనీరింగ్ కళాశాలలో లెక్కింపు
- 14 టేబుళ్లు, 21 రౌండ్లలో చేవెళ్ల సెగ్మెంట్ ప్రక్రియ
- ఎన్నికల రిటర్నింగ్ అధికారి సాయిరాం



సాయిరాం, ఎన్నికల రిటర్నింగ్ అధికారి

చేవెళ్ల: సాధారణ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు ఏర్పాటు పూర్తయ్యాయని చేవెళ్ల ఎన్నికల రిటర్నింగ్ అధికారి సాయిరాం తెలిపారు. శనివారం స్థానికంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని రాజేంద్రనగర్ పరిధి అప్పా సమీపాన ఉన్న లార్డ్స్ ఇంజినీరింగ్ కళశాల 3వ అంతస్తులో ఆదివారం ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపుతో ప్రక్రియ ప్రారంభం కానుందని, 8.30 గంటలకు ఈవీఎంల కౌంటింగ్ మొదలు అవుతుందని వెల్లడించారు. చేవెళ్ల సెగ్మెంట్‌కు సంబంధించి ఓట్లను లెక్కిస్తారని చెప్పారు. నియోజకవర్గంలో మొత్తం 2,62,005 ఓట్లు ఉండగా, నవంబర్ 30న 1,94,343 ఓట్లు (పురుషులు 99,705, మహిళలు 94, 638) పోలయ్యాయని పేర్కొన్నారు. దీంతో ఓటింగ్ శాతం 74.18శాతంగా నమోదైందని తెలిపారు.

నిఘా నీడలో..

నియోజకవర్గంలో మొత్తం 2,086 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు నమోదుయ్యాయని, వాటిని మొదటగా లెక్కిస్తారని, వీటికోసం 6 టేబుళ్లు కేటాయించినట్లు చెప్పారు. 298 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన ఈవీఎంలను ఇప్పటికే స్ట్రాంగ్ రూంలో భద్రపరిచినట్లు వివరించారు. కౌంటింగ్‌లో అసెంబ్లీకి 14 టేబుళ్లను ఏర్పాటుచేసి, మొత్తం ఓట్లను 21 రౌండ్లలో లెక్కించడానికి సన్నాహాలు చేసినట్లు వెల్లడించారు. ఈ ప్రక్రియలో 150 మంది సిబ్బంది పాల్గొనున్నారని, లెక్కింపు మొత్తం సీసీ కెమెరాల నిఘాలో జరగనుందని తెలిపారు. కౌంటింగ్ అబ్జర్వర్‌గా సమీక్ష అనే అధికారిని నియమించామన్నారు. సాయంత్రం వరకు కౌంటింగ్ పూర్తి అవుతుందని తెలిపారు.

అభ్యర్థులకు పాస్‌ల జారీ

కౌటింగ్ హాల్‌కు వచ్చే ఏజెంట్లకు పార్టీల వారీగా వారి అభ్యర్థులకు ఒక్కొక్కరికి 20 పాస్‌లను ఇవ్వనున్నామని, అందులో భాగంగా చేవెళ్లలోని ఆర్డీఓ కార్యాలయంలో ఆర్‌ఓ ఆధ్వర్యంలో పాస్‌లను జారీ చేసినట్లు తెలిపారు. ఆదివారం ఉదయమే ఏజెంట్లు కౌంటింగ్ కేంద్రానికి రావాల్సి ఉంటుందన్నారు. ఇదిలా ఉండగా.. లార్డ్స్ కళాశాలలో రాజేంద్రనగర్, షాదర్‌నగర్, చేవెళ్ల నియోజకవర్గాలకు సంబంధించిన ఓట్లను కౌంటింగ్ చేయనున్నారని తెలిపారు.

డ్రగ్స్ తయారీ ముఠా అరెస్ట్

- రూ.50 లక్షల విలువైన మాదకద్రవ్యాలు స్వాధీనం

హిమాయత్‌నగర్: మాదకద్రవ్యాలు తయారు చేస్తున్న ముగ్గురు వ్యక్తులను తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో(టీఎస్‌ఎన్‌ఏబీ) పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.50 లక్షల విలువైన డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. బషీర్‌బాగ్‌లోని పాత కమిషనరేట్‌లో టీఎస్ఎన్ఏబీ డీఎస్పీ సీహెచ్.శ్రీధర్‌తో కలిసి టీఎస్ఎన్ఏబీ ఎస్పీ గుమ్మి చక్రవర్తి వివరాలు వెల్లడించారు. సురారంలో ముగ్గురు వ్యక్తులు లిక్విడ్ మెథాంఫెటమైన్, క్రిస్టల్ మెథాంఫెటమైన్ డ్రగ్స్ తయారు చేస్తున్నట్లు సమాచారం అందడంతో సురారం పోలీసులతో కలిసి దాడులు నిర్వహించిన పోలీసులు గాజుల రామారం ప్రాంతానికి చెందిన కమ్మ శ్రీనివాస్, నరసింహ రాజు, దాట్ల మణికంఠ వీర వెంకట నాగరాజులను అదుపులోకి తీసుకున్నారు. వారు లిక్విడ్ మెథాంఫెటమైన్‌ను ప్రాసెస్ చేసి క్రిస్టల్ మెథాంఫెటమైన్ డ్రగ్ తయారు చేస్తున్నట్లు తెలిపారు. వాటిని అవసరమైన వారికి విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారన్నారు. వారి నుంచి రూ.50లక్షల విలువైన 60 గ్రాముల క్రిస్టల్ మెథాంఫెటామైన్, 700 ఎంఎల్ లిక్విడ్ మెథాంఫెటమైన్‌తో పాటు పలు పరికరాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. డ్రగ్స్ రాకెట్ గుట్టు రట్టు చేసిన ఇన్‌స్పెక్టర్లు పి.రమేష్ రెడ్డి, టీఎస్ఎన్ఏబి సీఐలు డి.సంతోష్ కుమార్, జి.ఎస్. డేనియల్, సి.వెంకట రాములుతో పాటు సూరారం పోలీసులను ఎస్పీ అభినందించారు.


వివరాలు వెల్లడిస్తున్న టిఎస్ఎన్ఏబీ ఎస్పీ చక్రవర్తి

జైలుకు వెళ్లినా తీరు మారలేదు

ప్రధాన నిందితుడు కమ్మ శ్రీనివాస్ 2013లో జీడిమెట్ల పారిశ్రామిక వాడలో మెథాంఫెటమైన్ డ్రగ్ తయారు చేస్తుండగా నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో అధికారులు అతడిని అరెస్టు చేశారు. అతని నుంచి 10.9 కిలోల డ్రగ్స్ స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో అతను నాలుగేళ్ల జైలు శిక్ష అనుభవించారు. 2017లో బెయిల్‌పై బయటికి వచ్చిన అతను కాకినాడకు చెందిన చేపల చెరువుల వ్యాపారి నరసింహరాజు, దాట్ల మణికంఠలతో కలిసి డ్రగ్స్ తయారీ చేపట్టాడు. ఈ నేపథ్యంలో అందుకు అవసరమైన పరికరాలను కొనుగోలు చేసి సురారంలోని ఓ ఇంట్లో డ్రగ్స్ తయారు చేస్తున్నారు. మెథాంఫెటమైన్ డ్రగ్ రిలాక్స్ మూడ్‌లోకి తీసుకెళ్తుందని పలువురు దానిని వినియోగిస్తారు. గత రెండేళ్లుగా వారు దాదాపు ఆరు కిలోల డ్రగ్స్‌ను కస్టమర్లకు నేరుగా, సోషల్ మీడియా ద్వారా విక్రయించినట్లు పోలీసులు గుర్తించారు.

నిధులు మంజూరైనా పనుల్లో జాప్యం

- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందుల్లో జనం
- కొత్తూరులో మరమ్మతు పనులకు నోచుకోని కేజీబీవీ రహదారి


బాకారం సమీపంలో ఏర్పడిన గుంత

మొయినాబాద్‌రూరల్: రోడ్డు అభివృద్ధి కోసం నిధులు మంజూరైనా అధికారుల నిర్లక్ష్యం, కాంట్రాక్టర్ల అలసత్వం వెరసి బాకారం రోడ్డు అస్తవ్యస్తంగా మారింది. ప్రమాదాలకు నిలయంగా తయారైంది. రెండు సంవత్సరాల క్రితం మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఈ రోడ్డు పనులను ప్రారంభించారు. కానీ సకాలంలో పూర్తి కాకపోవడంతో పలు గ్రామాల ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఎన్కెపల్లి-బాకారం రోడ్డు విస్తీర్ణత పనులకు రూ.2.20 కోట్ల నిధులు మంజూరు చేశారు. 2022, మార్చిలో మంత్రి ఈ రోడ్డు పనులను ప్రారంభించారు. అంతరాష్ట్ర రహదారి నుంచి ఎన్కెపల్లి మీదుగా బాకారం వరకు ఈ రోడ్డు పనులు నిర్మించాల్సి ఉంది. సదరు కాంట్రాక్టర్ ఈ పనులు సక్రమంగా చేయకపోవడంతో ఇక్కడి జనం అసంతృప్తిగా ఉన్నారు. దీంతో వాహనాదారులు, ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అంతరాష్ట్ర రహదారి ఎన్కెపల్లి చౌరస్తా నుంచి ఎన్కెపల్లి గ్రామ శివారు వరకు రోడ్డు పనులు పూర్తి చేసి కాంట్రాక్టర్లు చేతులు ఎత్తేశారని పేర్కొంటున్నారు. ఎన్కెపల్లి మొదలుకొని బాకారం వరకు రోడ్డు పనులు చేపట్టలేదు. దీంతో ఈ రోడ్డు గుంతల మయంగా మారి నిత్యం ఏదో ఒక చోట ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు, స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా ఈ రోడ్డు పనులను పూర్తి చేయించేవిధంగా ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

కొత్తూరులో..

కొత్తూరు: మండలకేంద్రం నుంచి కస్తుర్బాగాంధీ బాలికల హాస్టల్‌కు వెళ్లే ప్రధాన రోడ్డును మరమ్మతు పనులు చేయాలని కొత్తూరు పట్టణ బీజేపీ అధ్యక్షుడు నాగరాజుచారి శనివారం ఒక ప్రకటనలో అధికారులను కోరారు. పట్టణానికి కిలోమీటర్ దూరంలో ఉన్న హాస్టల్‌కు వెళ్లే రోడ్డు గుంతలమయంగా మారిందన్నారు. దీనికి తోడు రోడ్డుకు ఇరువైపులా లైట్లు లేకపోవడంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటునట్లు స్థానికులు చెబుతున్నారు. అత్యవసర సమయాల్లో, రాత్రి వేళల్లో హాస్టల్‌కు వెళ్లేందుకు, అక్కడి నుంచి పట్టణానికి వచ్చేందుకు విద్యార్థులు, సిబ్బంది ఇబ్బందులు పడుతున్నట్లు పేర్కొన్నారు.